క్లుప్తంగా

దేదీప్యంగా నవహారతులు



నాగాయలంక: స్థానిక కృష్ణానది తీరంలోని శ్రీరామలింగేశ్వరస్వామి మండపంలో బుధవారం రాత్రి జరిగిన నవహారతులు దేదీప్యమానంగా సాగాయి. కార్తిక పంచమి విశిష్టతతో ఆధ్యాత్మిక సౌరభంతో సాగిన హారతుల కార్యక్రమానికి అధిక సంఖ్యలో మహిళలు, భక్తులు తరలివచ్చారు.

24, 25 తేదీల్లో ఆలయ ముఖమండపం ఆవిష్కరణ

టి.కొత్తపాలెం(నాగాయలంక): గ్రామంలోని పురాతనమైన శ్రీభ్రమరాంబ సమేత శ్రీమల్లేశ్వర స్వామి దేవస్థానంలో నూతనంగా నిర్మించిన ముఖమండపం ఆవిష్కరణ మహోత్సవం 24, 25తేదీల్లో జరుగుతుందని నిర్వాహక కమిటీ ప్రతినిధి బండ్రెడ్డి నాగిరెడ్డి బుధవారం తెలిపారు. నారేపాలెం గ్రామస్తులు మెండు శివరామప్రసాద్, నాగేశ్వరీ విజయలక్ష్మి దంపతుల ఆర్థిక సౌజన్యంతో మండపం నిర్మించారు. ఆవిష్కరణ ఉత్సవంలో భాగంగా 24న పూజ, జపాలు, పారాయణాలు, హోమాలు, శయనోత్సవం 25న రుద్రహోమం, చండీహోమం, మహా పూర్ణాహుతి, భక్తులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమాలు జరుగుతాయని వివరించారు.

ఆర్ఎంపీలు తమ పరిధిలోనే సేవలందించాలి

పెడన: గ్రామీణ వైద్యులు(ఆర్ఎంపీలు)తమ పరిధిలోనే వైద్య సేవలను అందించాలని కృష్ణా జిల్లా గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు బి. వెంకటరాజు అన్నారు. పెడనలో బీఈ ఫార్మా కంపెనీ ఆధ్వర్యంలో పెడన ఏరియా అధ్యక్షుడు పి. రవీంద్ర అధ్యక్షతన గ్రామీణ వైద్యులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న వెంకటరాజు మాట్లాడుతూ ప్రతి సభ్యుడు ఏటా డిసెంబర్ 31వ తేదీ వరకు రెన్యువల్ చేసుకుని సభ్యత్వాన్ని కొనసాగించాలని స్పష్టం చేశారు. దురదృష్టవశాత్తూ సభ్యులలో ఎవరైనా అకాల మరణం చెందితే వారి కుటుంబానికి సంఘం అన్ని విధాలుగా అండగా నిలుస్తుందని పేర్కొన్నారు.

పశువులకు టీకాలు

వక్కపట్లవారిపాలెం(నాగాయలంక): మండల పశు సంవర్ధకశాఖ ఆధ్వర్యంలో వక్కపట్లవారిపాలెం గ్రామ పంచాయతీ పరిధిలో మండల పశు వైద్యాధికారి డాక్టర్ సీహెచ్ సాయిమౌనిక నేతృత్వంలో బుధవారం బ్రూసెల్లోసిస్ వ్యాధి నివారణ టీకాల కార్యక్రమం జరిగింది. గ్రామ సర్పంచ్ అంబటి శ్యామ్‌ప్రసాద్ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. డాక్టర్ మౌనిక పశువుల యజమానులతో మాట్లాడుతూ నాలుగు నుంచి ఎనిమిది నెలల వయస్సు నిండిన పెయ్య దూడలకు ఈసుకుపోయే వ్యాధి నివారణ చర్యగా ప్రతి రైతు ఈ టీకాలు వేయించాలని సూచించారు.

రాష్ట్రాన్ని కాపాడే సత్తా కాంగ్రెస్‌కే ఉంది

మచిలీపట్నంటౌన్: అభివృద్ధికి దూరమైన రాష్ట్రాన్ని కాపాడే సత్తా ఒక్క కాంగ్రెస్ పార్టీకే ఉందని పీసీసీ ప్రధాన కార్యదర్శి, జిల్లా రాజకీయ వ్యవహారాల ఇన్‌చార్జ్ ఎం. బాబ్జీ అన్నారు. ఇటీవల నూతనంగా నియమితులైన కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గాల కో ఆర్డినేటర్‌ల సమన్వయ సమావేశం బుధవారం స్థానిక డీసీసీ కార్యాలయంలో జరిగింది. ఈ సమావేశానికి హాజరైన బాబ్జీ మాట్లాడుతూ రాష్ట్రాన్ని అభివృద్ధి చేయటంలో అధికార, ప్రతిపక్ష పార్టీలైన టీడీపీ, వైఎస్సార్‌సీపీలు విఫలమయ్యాయని దుయ్యబట్టారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రతిపక్ష పాత్ర పోషించాలని అన్నారు.

టీటీడీ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం

కోడూరు: తిరుమల తిరుపతి దేవస్థానంలో అన్యమత ఉద్యోగులను వేరే శాఖలకు బదిలీ చేస్తూ తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నట్లు అష్టాక్షరీ పీఠాధిపతి త్రిదండి అష్టాక్షరీ సంపత్ కుమార రామానుజీయర్ స్వామిజీ తెలిపారు. ఉల్లిపాలెంలోని శ్రీమన్నారాయణ స్వామివారి ఆలయం వద్ద అష్టాక్షరీ స్వామిజీ బుధవారం మీడియాతో మాట్లాడారు. హిందువుల మనోభావాలకు పెద్దపీట వేస్తూ టీటీడీ మంచి నిర్ణయం తీసుకుందని స్వామిజీ చెప్పారు.

ఎనిమిది వేల మందితో కార్తిక దీపోత్సవం

అభినవ మేల్కోటగా పేరుగాంచిన ఉల్లిపాలెంలోని గోదా, రాజ్యలక్ష్మీ సమేత శ్రీమన్నారాయణ స్వామివారి ఆలయంలో ఈ నెల 25న ఎనిమిది వేల మంది భక్తులతో కార్తిక దీపోత్సవాన్ని నిర్వహించనున్నట్లు అష్టాక్షరీ స్వామిజీ చెప్పారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

పెడన: రన్నింగ్‌లోని ఇసుక ట్రాక్టరుపై నుంచి కింద పడ్డ వ్యక్తి చికిత్స పొందుతూ బుధవారం ఉదయం మృతి చెందిన సంఘటన పెడన పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పెడన పోలీసులు తెలిపిన వివరాల మేరకు ఈ నెల 17వ తేదీన పెడన మండలం నడుపూరు నుంచి చేవేంద్రకు ఇసుకను ట్రాక్టరులో తరలిస్తుండగా బందరు మండలం హుస్సేన్‌పాలెంకు చెందిన శ్రీకాకుళపు ఆనందబాబు(30) చేవేంద్ర సమీపంలో ట్రాక్టరుపై నుంచి కిందపడిపోయాడు. సహచరులు హుటాహుటిన మచిలీపట్నం ప్రభుత్వాస్పత్రికి తరలించగా అక్కడ నుంచి విజయవాడ ప్రభుత్వాసుపత్రికి రిఫర్ చేశారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం ఉదయం చనిపోయాడు. ఆనందబాబు తండ్రి ఏడుకొండలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పెడన ఎస్ఐ-2 రాజేంద్రప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు



విజేతలకు బహుమతులను అందజేస్తున్న ప్రసాద్



బందరులో బహుమతులు పొందిన విద్యార్థులు



అవనిగడ్డలో ఆకట్టుకున్న చిన్నారుల వేషధారణ

పెడన: గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని, వాటిని ఎంత ఉపయోగించుకుంటే అంత మంచి ఫలితాలు రాబట్టుకోవచ్చని కౌన్సిలర్ కటకం ప్రసాద్ అన్నారు. బుధవారం పెడన శాఖ గ్రంథాలయంలో వారోత్సవాలు ముగిశాయి. అనంతరం గ్రంథాలయంలో వారం రోజులు పాటు నిర్వహించిన వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. గ్రంథాలయశాఖ అభివృద్ధి కమిటీ చైర్మన్ బళ్ల మల్లికార్జున ప్రసాద్, వహబ్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

- **గూడూరు:** గ్రంథాలయ వారోత్సవాలు బుధవారం ఘనంగా ముగిశాయి. గూడూరు శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించారు. ఆయా పోటీలలో విజేతలకు సర్పంచి లింగం సులోచనారాణి బహుమతులు ప్రదానం చేశారు. వైఎస్సార్ సీపీ నాయకుడు లింగం విజయ్‌కుమార్, తుమ్మలపాలెం హెచ్ఎం ఉండిరాణి, గోపి, గ్రంథాలయ అధికారి వై.శ్రీనివాసరావు, విద్యార్థులు పాల్గొన్నారు.
- **బంటుమిల్లి:** మండల పరిధిలోని ఆర్తమూరు శాఖ గ్రంథాలయంలో గత వారం రోజులుగా జరుగుతున్న 57వ గ్రంథాలయ వారోత్సవాలు బుధవారంతో ముగిశాయి. ఇందులో భాగంగా వారం రోజులుగా నిర్వహించిన పలు పోటీల్లో గెలుపొందిన విజేతలకు స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల టీచరు ఇందిర ముఖ్య అతిథిగా పాల్గొని బహుమతులు, మెరిట్ సర్టిఫికెట్లు అందజేసి అభినందించారు.
- **కోడూరు:** జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపును పురస్కరించుకొని స్థానిక గ్రంథాలయంలో గ్రంథాలయ అధికారి పుష్పలత అధ్యక్షతన జరిగిన సభలో ఎస్ఐ చాణిక్య, జెడ్పీటీసీ యాదవరెడ్డి వెంకటసత్యనారాయణ మాట్లాడారు. వివిధ అంశాల్లో నిర్వహించిన పోటీల్లో ప్రతిభకనబర్చిన వారికి బహుమతులు పంపిణీ చేశారు.
- **మచిలీపట్నంటౌన్:** స్థానిక ఈడేపల్లి శాఖా గ్రంథాలయంలో జరిగిన పలు పోటీల్లో విజేతలకు బుధవారం రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర సతీమణి నీలిమ బహుమతులను అందజేశారు. విద్యార్థులు పాల్గొని బహుమతులు పొందారు. విద్యార్థులను నారాయణ స్కూల్స్ ఏజీఎం సుమంత్, ప్రిన్సిపాల్ విన్నకోట హరిణి, అకడమిక్ డీన్ ఆర్జా శివ శంకర్, ఏ ఓ విశ్వనాధపల్లి రవి కుమార్ అభినందించారు.
- **మచిలీపట్నంటౌన్:** జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా స్థానిక చింతగుంటపాలెం శాఖా గ్రంథాలయంలో నిర్వహించిన పలు పోటీల్లో ప్రతిభ కనబర్చి విజేతలైన విద్యార్థులకు బుధవారం బహుమతులను అందజేశారు. 29వ డివిజన్ కార్పొరేటర్ కట్టా కేదారేశ్వరరావు విద్యార్థులకు బహుమతులను అందజేశారు. రిటైర్డ్ హెచ్ఎం కేఆర్‌కే గాంధీ, గ్రంథాలయాధికారి డీవీ నాగరవి పాల్గొన్నారు.
- **అవనిగడ్డ:** జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముంగింపు సందర్భంగా బుధవారం దేశభక్తి పోటీలు, లెమన్ స్పూన్, వ్యాసరచనతో పాటు పలు రకాల పోటీలు నిర్వహించారు. అనంతరం విజేతలకు ఎంపీపీ తుంగల సుమతీదేవి, గ్రామీణ యువజన వికాస సమితి అధ్యక్షుడు మండలి వెంకట్రామ్, తహసీల్దార్ నాగమల్లేశ్వరరావు బహుమతులు అందించారు. చిన్నారులు పలువురు నాయకుల వేషధారణలో ఆకట్టుకున్నారు. గ్రంథాలయ అధికారి జె ప్రభుదాస్ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది.
- **ఘంటసాల:** మండలంలోని ఘంటసాల, కొడాలి గ్రంథాలయాల్లో వారోత్సవాల ముగింపు కార్యక్రమాలు లైబ్రేరియన్లు ఎం.శరత్ కుమార్, ఎం.సుబ్బారావు ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. వారం రోజుల పాటు గ్రంథాలయాల్లో నిర్వహించిన వివిధ రకాల పోటీల్లో విజేతలైన విద్యార్థులకు అతిథులచే బహుమతులు అందించారు. ఘంటసాలలో సర్పంచ్ బి.వెంకటేశ్వరమ్మ, ఎంఈవో 2 ఎండీ మోమిన్, కొడాలిలో ఉప సర్పంచ్ తుమ్మల శంకరరావు, ఈవో నాగమణి పాల్గొన్నారు.
- **మచిలీపట్నంటౌన్:** విద్యార్థులు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకుని మంచి విజ్ఞాన వంతులుగా ఎదగాలని ఏపీఎస్ ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు అన్నారు. 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో పలు పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి ఆయన బహుమతులను అందజేశారు. జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వి. రవి కుమార్ తదితరులు పాల్గొన్నారు.
- **రావివారిపాలెం(మోపిదేవి):** జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సందర్భంగా నిర్వహించిన ఆటల పోటీల్లో విజేతలకు బుధవారం మోపిదేవి జెడ్పీ పాఠశాల విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు కంఠంనేని కుటుంబరావు బహుమతుల ప్రదానం చేశారు. గ్రంథాలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు బొందలపాటి సుబ్బారావు అధ్యక్షతన వహించారు.

ట్రాక్టర్లను వదిలేసి ఎడ్లబండ్లను ఆపడం సరికాదు

మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు



చల్లపల్లిలో డీటీకి వినతి పత్రం ఇస్తున్న మాజీ ఎమ్మెల్యే సింహాద్రి, ఎడ్లబండ్ల నిర్వాహకులు

అవనిగడ్డ: అక్రమ ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్లను వదిలేసి, జీవనోపాధి కోసం ఇసుక తోలుకుంటున్న ఎడ్లబండ్లను అధికారులు ఆపడం ఎంతవరకూ సమంజసమని మాజీ శాసనసభ్యుడు సింహాద్రి రమేష్‌బాబు ప్రశ్నించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఎడ్లబండ్ల నిర్వాహకులతో కలసి సింహాద్రి డెప్యూటీ తహసీల్దార్ శ్రీలతకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సింహాద్రి రమేష్‌బాబు మాట్లాడుతూ కేసీపీ కర్మాగారం మూతపడిన తరువాత సరైన కిరాయిలు లేక ఎడ్లబండ్ల నిర్వాహకులు రోడ్డున పడ్డారన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఇసుక తోలుకునేందుకు ఎడ్లబండ్ల నిర్వాహకులకు అనుమతి ఇచ్చామని, ఎక్కడా ఆటంకం కల్పించలేదన్నారు. చల్లపల్లి మండలంలో ట్రాక్టర్ల ద్వారా ఇసుక అక్రమ రవాణా చేస్తున్న వారిని వదిలేసి ఎడ్లబండ్లను ఎందుకు అడ్డుకుంటున్నారని ఆయన అధికారులను ప్రశ్నించారు. శాసనసభ్యుడు బుద్ధప్రసాద్ వేదికల మీద సహజ వనరులను రక్షించుకోవాల్సిన అవసరం అందరిపై ఉందని నీతులు చెబుతారని, రాత్రిళ్లు మాత్రం వందలాది ట్రాక్టర్లతో తమ మనుషులు ఇసుక అక్రమ రవాణా చేస్తున్నా పట్టించుకోరని ఎద్దేవా చేశారు.

మెరైన్ పోలీసుల మాక్ డ్రిల్



ఎదురుమొండి పంటు ప్లాట్‌ఫారమ్ వద్ద వాహన తనిఖీలు చేస్తున్న సిబ్బంది

నాగాయలంక: మండలంలోని తీరగ్రామాలలో సాగర కవచ్‌లో భాగంగా డిఫెన్స్ మాక్‌డ్రిల్ పేరుతో నిర్వహించే రెండు రోజుల కార్యక్రమం బుధవారం ప్రారంభమైంది. మచిలీపట్నం ఆర్మ్‌డ్ రిజర్వ్ డీఎస్పీ కె.వెంకటేశ్వరరావు, అవనిగడ్డ డీఎస్పీ పి.మురళీధర్, అవనిగడ్డ సీఐ యువకుమార్ పర్యవేక్షణలో 50మంది పోలీసులతో సీ విజిల్ ఎక్సర్‌సైజ్ నిర్వహించారు. ఇండియన్ నేవీకి చెందిన కొంతమంది సిబ్బంది తీవ్రవాదుల రూపంలో సముద్రమార్గం ద్వారా బయలుదేరి తీర ప్రాంతంలోని ఏదో ఒక గ్రామంలో పేలుడు పదార్థాలను పెట్టడానికి ప్రయత్నిస్తారు. వారి పన్నాగాన్ని నిర్వీర్యం చేసి అలాంటి వారిని అదుపులోకి తీసుకోవడంతో సీ విజిల్ ఎక్సర్‌సైజ్ ముగుస్తుంది. కొత్త వ్యక్తులు పట్ల అవగాహన కలిగి ఉండటానికి, వారిని గమనించడానికి తీరప్రాంతవాసుల్లో అవగాహన పెంపొందించే క్రమంలో కేంద్ర ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం భారత నౌకా దళం, మెరైన్ పోలీసులు సంయుక్తంగా వివిధ బృందాలుగా ఏర్పడి ఈ మాక్ డ్రిల్ చేశామని మెరైన్ సీఐ వివరించారు. దీనిపై పూర్తి స్థాయిలో అవగాహన కలిగించేలా, తీర గ్రామాల్లోని చొరబాటుదారులను కనుగొనే విధంగా బుధవారం ఆయా గ్రామాల కూడళ్లలో గస్తీ నిర్వహించారు. వాహనాల తనిఖీలు చేపట్టారు. పాలకాయతిప్ప మెరైన్ పోలీస్ స్టేషన్ సీఐ సురేష్‌రెడ్డి, అవనిగడ్డ సబ్‌డివిజన్, మెరైన్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

బాల్య వివాహాలకు దూరంగా ఉండండి

డీవైఈఓ శేఖర్‌సింగ్



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

మచిలీపట్నంటౌన్: బాల్య వివాహాలకు అందరూ దూరంగా ఉండాలని యువతీ, యువకులకు సరైన వయస్సు వచ్చిన తర్వాతే వివాహాలు చేయాలని మచిలీపట్నం డీవైఈఓ శేఖర్‌సింగ్ పిలుపునిచ్చారు. అంతర్జాతీయ బాలల దినోత్సవం, బాలల హక్కుల దినోత్సవంలో భాగంగా బుధవారం స్థానిక రాంజీ హైస్కూల్, హైనీ హై స్కూల్‌లోని బాల బాలికలకు పలు అంశాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా మహిళా, స్త్రీ శిశు సంక్షేమ శాఖలోని వన్ స్టాప్ సెంటర్, ఐసీపీఎస్, జిల్లా విద్యాశాఖల ఆధ్వర్యంలో బాలల హక్కులు, గుడ్ టచ్ బ్యాడ్ టచ్ వంటి విషయాలపై అవగాహన కల్పించారు. చైల్డ్ హెల్ప్ లైన్ నంబర్స్ 1098, ఉమెన్ హెల్ప్ లైన్ నంబర్ 181లను వినియోగించాలని సూచించారు. మాదకద్రవ్యాల నిర్మూలన, బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన కల్పించారు. ముఖ్యఅతిథిగా అజీర్ అహ్మద్, సెంట్రల్ అడ్మినిస్ట్రేటర్ ఆశిష్మ, డీసీపీఓ మౌనిష, ఐసీపీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

దేవస్థానం సమగ్ర అభివృద్ధికి కృషి

ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్



శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బుద్ధప్రసాద్

మోపిదేవి: స్థానిక మోపిదేవి శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామివారి దేవస్థానంలో భక్తుల సౌకర్యాలకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు స్థానిక ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ పేర్కొన్నారు. దేవస్థానానికి చెందిన కోనేరు స్థలంలో నూతన షాపింగ్ కాంప్లెక్స్, భక్తులకు రూముల నిర్మాణానికి బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిరోజు స్వామివారి దర్శనానికి వేలాది భక్తులు వస్తున్న నేపథ్యంలో వారికి సౌకర్యాల కల్పనకు రూ. 2.75 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. దేవదాయశాఖ డీసీ దాసరి శ్రీరామ వరప్రసాదరావు మాట్లాడుతూ భక్తుల సౌకర్యార్థం దేవస్థానంలో విస్తృత అభివృద్ధి కార్యక్రమాలు, నిర్మాణ పనులు చేపట్టినట్లు వివరించారు. అంతకముందు శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామివారిని ఎమ్మెల్యే దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ధరలు పెంచడంపై పాడి రైతుల హర్షం

బంటుమిల్లి: కృష్ణా మిల్క్ యూనియన్ రైతుల వద్ద సేకరిస్తున్న పాల ధరలను పెంచడంపై పశు పోషకులు(రైతులు) హర్షం వ్యక్తం చేశారు. రైతులను ఆర్థికంగా ఆదుకునేందుకు కృషి చేస్తున్న యూనియన్ పెరుగుతున్న ఖర్చుల దృష్ట్యా డిసెంబర్ ఒకటో తేదీ నుంచి లీటరుకు రూ. 2 పెంచాలని నిర్ణయించింది. దీనిపై పలు గ్రామాల పాల సొసైటీల అధ్యక్షులు పేపేటీ వీరమ్మ, పుప్పాల శ్రీరామమూర్తి, పాశం నాగవరప్రసాదు, సుంకర సాయి బాబు, తిరుమాని సత్యనారాయణ, ముక్కు వీర వెంకటేశ్వరరావులతోపాటు పెడన మండలంలోని పలు గ్రామాల పాల సొసైటీ అధ్యక్షులు జిల్లా చైర్మన్ చలసాని ఆంజనేయులు, పాలకవర్గ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

చల్లపల్లి(అవనిగడ్డ): డిసెంబర్ నుంచి కృష్ణామిల్క్ యూనియన్ పరిధిలోని పాడిరైతుకు లీటర్‌కు రెండు రూపాయలు పెంచి రూ.82 ఇవ్వనున్నట్టు యూనియన్ సభ్యులు వేమూరి సాయి వెంకటరమణ బుధవారం తెలిపారు. చల్లపల్లి పాలశీతల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ చైర్మన్ చలసానికి కృతజ్ఞతలు తెలిపారు.

మోపిదేవి: పాల ఉత్పత్తిదారులకు డిసెంబర్ 1 నుంచి 10.0 వెన్న శాతానికి రూ. 2 పెంచినట్లు కృష్ణా మిల్క్ యూనియన్ జిల్లా పాలకవర్గ సభ్యుడు వేమూరి సాయివెంకటరమణ తెలిపారు. చైర్మన్ చలసాని ఆంజనేయులుకు మోపిదేవి, అవనిగడ్డ బీఎంసీ పరిధిలోని సంఘాల అధ్యక్షులు, పాడి రైతులు ధన్యవాదాలు తెలిపారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక



మాట్లాడుతున్న పూర్వ విద్యార్థులు

పెడన: పూర్వ విద్యార్థులు ఆత్మీయంగా కలుసుకుని కుసల ప్రశ్నలతో ఉత్సాహంగా ఉల్లాసంగా గడపడమే కాకుండా అత్యంత భక్తి శ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించి కార్తీకవనసమారాధనలో పాల్గొన్నారు. 1972-73వ సంవత్సరంలో పట్టణంలోని భట్టజ్ఞానకోటయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు 51 సంవత్సరాల తరువాత స్థానిక శ్రీగంగాపార్వతీ సమేత ఆగస్తేశ్వరస్వామి ఆలయంలో అంతా ఒకేచోట కలుసుకోవడంతో వారి ఆనందానికి అవధుల్లేకుండా పోయింది. కొందరు కుటుంబసభ్యులతో హాజరై ఆనందంలో పాలుపంచుకున్నారు. శింగంశెట్టి ఆదినారాయణ, రజని దంపతులు పూజాది కార్యక్రమాల్లో పాల్గొన్నారు. బళ్ల నాగేశ్వరరావు, దుర్గాభవాని దంపతులను సన్మానించారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలని ధర్నా



మచిలీపట్నంటౌన్: పెండింగ్‌లో ఉన్న అక్టోబర్ నెల జీతాన్ని వెంటనే చెల్లించాలని మచిలీపట్నం నగరపాలక సంస్థ కాంట్రాక్టు పారిశుద్ధ్య కార్మికులు డిమాండ్ చేశారు. తమ జీతాలను ప్రతి నెలా మొదటి వారంలోనే చెల్లించాలని కోరుతూ కార్మికులు సీఐటీయూ అనుబంధ ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో బుధవారం ఎంఎంసీ కార్యలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా గౌరవాధ్యక్షుడు బూర సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ పారిశుద్ధ్య కార్మికులకు జీతాలు సకాలంలో అందించటంలో మున్సిపల్ అధికారులు విఫలమవుతున్నారని ఆరోపించారు. ప్రతినెలా మొదటి వారంలోనే అందించాల్సిన వేతనం గత ఆరు నెలల నుంచి 15 లేదా 20 తేదీల్లో అందించడం వల్ల కార్మికులు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. సీఐటీయూ నగర గౌరవాధ్యక్షురాడు సీహెచ్ బుల్లెమ్మ, యూనియన్ నగర ప్రధాన కార్యదర్శి డి. నాగమల్లేశ్వరరావు మాట్లాడారు. యూనియన్ నగర ఉపాధ్యక్షులు టి. వెంకటేశ్వరావు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

■ పీహెచ్‌సీల్లో తనిఖీలు

పెడన: ల్యాబ్‌లో పరికరాలన్ని పనిచేస్తున్నాయా.. ఏమైనా పనిచేయడం లేదా అంటూ స్టేట్ కమిటీ సభ్యులు పెడన ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆరా తీశారు. బుధవారం మధ్యాహ్నం హెల్త్‌వెల్‌నెస్ సెంటర్స్ ప్రొగ్రామింగ్ స్టేట్ అధికారి వై. సుబ్రహ్మణ్యం, కన్సల్టెంట్ గంగాధర్, డీపీవో శాస్త్రి పెడన పీహెచ్‌సీని సందర్శించారు. ఆస్పత్రిలోని ఓపీ రికార్డులతో పాటు సిబ్బంది పనితీరు, మందులు స్టాక్, ల్యాబ్ తదితర విషయాలపై ఆరా తీయడమే కాకుండా రికార్డులను పరిశీలించారు. పీహెచ్‌సీ వైద్యురాలు మీనాక్షిదేవితో పాటు ఆస్పత్రి సిబ్బంది పలు విషయాలను వారికి వివరించారు.

పెదకళ్లేపల్లి(మోపిదేవి): మండల పరిధిలోని రావివారిపాలెం, పెదకళ్లేపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఆరోగ్యశాఖ జేడీ డాక్టర్ సునీల్ కుమార్ నాయక్, డాక్టర్ నాగజ్యోతి బుధవారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు.

ఘంటసాల: మండలంలోని మూడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను మెర్సువల్ హైజీన్ మేనేజ్‌మెంట్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ రత్నావళి ఆధ్వర్యంలో బుధవారం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని శ్రీకాకుళం, ఘంటసాల, ఘంటసాలపాలెం గ్రామాల్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను రత్నావళి ఆధ్వర్యంలో వచ్చిన బృందం పరిశీలించి, సంబంధిత డాక్టర్ల నుంచి వివరాలను అడిగి తెలుసుకున్నారు.

■ శ్రీవాసవి క్షేత్రంలో కోటి దీపోత్సవం

పెడన: కార్తిక మాసం శివుని జన్మ నక్షత్రం ఆరుద్ర నక్షత్రం సందర్భంగా స్థానిక శ్రీ వాసవీ క్షేత్రంలోని బుధవారం రాత్రి అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో కోటి దీపోత్సవం పూజా కార్యక్రమాన్ని పట్టణ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

■ నిబంధనల మేరకే మినీ గోకులం

కృత్తివెన్ను: ఉపాధిహామీ పథకంలో రైతులకు ఉపయోగపడేలా ప్రభుత్వం అందిస్తున్న మినీ గోకులం నిర్మాణాలను నిబంధనల మేరకే చేపట్టాలని పథకం ఏపీవో పసుపులేటి సైదారావు అన్నారు. మండల వ్యాప్తంగా ఈ నిర్మాణాలు వేగవంతంగా సాగుతున్నాయన్నారు. మండలంలో మొత్తం 64 మంది రైతులకు మినీ గోకులం షెడ్లు మంజూరయ్యాయన్నారు. రెండు పశువులకు రూ. 1.15 లక్షలు, నాలుగు పశువులకు రూ. 1.85 లక్షలు, ఆరు పశువులకు రూ. 2.30 లక్షల అంచనాలతో నిధులు మంజూరవుతాయని నిబంధనల మేరకు నిర్మాణం చేపట్టిన దాని ప్రకారం బిల్లుల చెల్లింపులు జరపనున్నట్లు వివరించారు.

■ అగ్నిమాపక కేంద్రం సందర్శన

బంటుమిల్లి: విజయవాడలోని రాష్ట్ర డిజాస్టర్ రెస్పాన్స్ ఫైర్ సర్వీసెస్ అడిషనల్ డైరెక్టర్ జి.శ్రీనివాసులు బుధవారం బంటుమిల్లి అగ్నిమాపక కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన కేంద్రంలో జరుగుతున్న పనితీరును సమీక్షించారు. కేంద్రంలోని రిజిస్టర్లు, అగ్నిమాపక శకటాన్ని పరిశీలించి ఫైర్ ఆఫీసర్ బి.వెంకటేశ్వరరావును వివరాలు అడిగి తెలుసుకున్నారు.

■ ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

గూడూరు: మండలంలోని మల్లవోలు ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తహసీల్దార్ డి.రాజ్యలక్ష్మి బుధవారం ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ మండలంలో 17 రైతు సేవా కేంద్రాల పరిధిలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. మండల వ్యవసాయ అధికారి కె.ఆంజనేయ కుమార్ పాల్గొన్నారు.

■ రైలు కింద పడిన వ్యక్తి ఆచూకీ లభ్యం

పెడన: రైలు కింద పడి మృతిచెందిన వ్యక్తి ఆచూకీ లభ్యమైంది. పెడన పట్టణంలోని బ్రహ్మపురానికి చెందిన రాజాది ప్రసాద్(34)గా పోలీసులు గుర్తించారు. ఆరు నెలలు కిందట భార్యభర్తలు విడిపోయి తల్లిదండ్రులు వద్ద ఉంటున్న ప్రసాద్, మద్యానికి బానిసై ఇంట్లో వారిని డబ్బులు కోసం వేధిస్తూ ఉండేవాడు. ఈ నేపథ్యంలో మంగళవారం ఇంట్లో డబ్బులు అడగడంతో ఇవ్వలేదు. దీంతో ఇంట్లో వారితో డబ్బులు ఇవ్వమంటే ఇవ్వడం లేదు కదా నేను రైలు కింద పడి చచ్చిపోతానంటూ చెప్పి వెళ్లాడు. ఈ క్రమంలో మంగళవారం మధ్యాహ్నం గుడివాడ, మచిలీపట్నం వెళ్లే రైలు కింద బైపాస్ రోడ్డులోని గేట్ వద్ద పడి మృతి చెందాడు. రైల్వే పోలీసులు గుర్తు తెలియని మృతదేహంగా గుర్తించడంతో మంగళవారం రాత్రి ఇంట్లోని వారు గుర్తించి రైల్వేపోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోస్టుమార్టం అనంతరం ప్రసాద్ మృతదేహాన్ని కుటుంబీకులకు అప్పగించారు.

■ వేంకటేశ్వరస్వామికి లక్ష తులసి పూజ

వేకనూరు(అవనిగడ్డ): వేకనూరులో వేంచేసియున్న సంతాన వేంకటేశ్వరస్వామి ఆలయంలో బుధవారం స్వామివారికి లక్షతులసి పూజ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు దీవి కృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో 12 మంది రుత్వికులు స్వామివారికి పంచామృతాలతో అభిషేకాలు చేశారు. అనంతరం లక్షతులసి పూజ జరిపించారు. వికాస తరంగిణి భక్త బృందం తులసి దళాలను సేకరించి స్వామివారికి సమర్పించారు.

■ కృష్ణానదిలో పంటు నిలిపివేత

నాగాయలంక: మండలంలోని ఏటిమొగ-ఎదురుమొండి గ్రామాల మధ్య పంటు సేవలు నిలిపివేసినట్లు మండల తహసీల్దార్ ఎం.హరనాథ్ బుధవారం చెప్పారు. కృష్ణానదిలో రెండు బోట్‌ల సంగడితో కట్టిన నావలోనే ప్రజా రవాణాకు అనుమతించినట్లు ఆయన తెలిపారు. పంటు మరమ్మతులు నిర్వహణ నిమిత్తం కొద్ది రోజులు పాటు పంటును నిలిపివేస్తున్నట్లు వెల్లడించారు. ఈ సమయంలో బోట్‌లలో ప్రయాణానికి మనిషి ఒక్కరికి రూ.10, రెండు చక్రాల బైక్‌కు రూ.50లుగా నిర్ణయించినట్లు తహసీల్దార్, ఎంపీడీఓ, పోలీసు, మత్స్యశాఖలతో కూడిన కమిటీ నిర్ణయించినట్లు ప్రజలకు ఆయన వివరించారు.

■ మినుము విత్తన శుద్ధి తప్పనిసరి

కొత్తపల్లి(ఘంటసాల): మినుము సాగు చేసే రైతులు తప్పనిసరిగా విత్తన శుద్ధి చేయడం ద్వారా తెగుళ్ల బెడద తగ్గించుకోవచ్చని ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రం సస్యరక్షణ శాస్త్రవేత్త డాక్టర్ రేవతి అన్నారు. ఘంటసాల మండలం కొత్తపల్లి గ్రామంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయశాఖ అధికారి కె. మురళీ కృష్ణ ఆధ్వర్యంలో రైతులతో కలసి పొలాలను అధికారులు, శాస్త్రవేత్తలు పరిశీలించారు.

■ అగ్రి సెట్‌లో పాలిటెక్నిక్ విద్యార్థుల సత్తా

ఘంటసాల: ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం వారు నిర్వహించే వ్యవసాయ బీఎస్సీ అగ్రికల్చర్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ అగ్రిసెట్ - 2024లో ఘంటసాల వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు సత్తా చాటినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.సత్యప్రియ లలిత బుధవారం తెలిపారు. కళాశాల నుంచి 10 మంది విద్యార్థులు రాష్ట్రంలోని వివిధ కళాశాలల్లో బీఎస్సీ అగ్రికల్చర్ సీట్లు సాధించినట్లు చెప్పారు.

■ 104 ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

ఘంటసాల: న్యాయమైన 104 ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కూటమి ప్రభుత్వం చొరవ తీసుకుని కృషి చేయాలని ఘంటసాల మండలం 104 ఉద్యోగులు ఎ.శ్రీనివాసరావు, డి.సుబ్రహ్మణ్యంలు విన్నవించారు. 104 ఉద్యోగులు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఎంపీపీ వేమూరి రజని కుమారికి సమర్పించారు.

బుర్రె శాంసన్ సేవలు అభినందనీయం

కె. కొత్తపాలెం(మోపిదేవి): ఒంగోలులో స్థిరపడిన పీస్ గాస్పెల్ మినిస్ట్రీస్ నిర్వాహకుడు శాంసన్ తన స్వగ్రామాన్ని మర్చిపోకుండా సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని అవనిగడ్డ శాసనసభ్యుడు మండలి బుద్ధప్రసాద్ అన్నారు. మండలంలోని కె. కొత్తపాలెం దళితవాడలో సేవా భవన్, ఆ భవనంలో గ్రామవాసులకు పరిశుభ్రమైన మంచినీటిని అందించేందుకు మినరల్ వాటర్ ప్లాంట్, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ పేరిట గ్రంథాలయం, చిన్నారులకు ట్యూషన్ పాయింట్‌ను ఏర్పాటు చేయగా, బుధవారం ఎమ్మెల్యే వాటిని ప్రారంభించారు.